# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :140 EDITOR:CHERUKU UPENDAR, DATE : SATURDAY 30 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 140 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శనివారం 30 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## అసలేం జరుగుతోంది..!

### ఆందోళనలో అభ్యర్థులు .. సుప్రీంకు టీఎస్ పీఎస్సీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు


మరోసారి గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దుతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. డివిజన్ బెంచ్ కూడా సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించటంతో? తమ పరి స్థితేంటని మదనపడుతున్నారు అభ్యర్థులు. సుప్రీంలో కూడా ఇదే తరహా తీర్పు వస్తే? అంతే సంగతులు అని వాపోతున్నారు. తెలంగాణలో గ్రూప్ -1 అభ్యర్థులు తెగ టెన్షన్

మిగతా 2లో...

## 2023 ఆసియా గేమ్స్‌లో భారత్ సత్తా

### షూటింగ్‌లో రెండు స్వర్ణాలు, టెన్నిస్‌లో రజతం..!

చైనా - ప్రభాత సూర్యుడు



ఆసియా గేమ్స్ 2023లో భారత్ ఆటగాళ్లు సత్తా చాటుతున్నారు. చైనాలోని హాంగ్జౌలో జరుగుతున్న ఈ ఆసియా క్రీడల్లో ... శుక్రవారం భారత షూటర్లు రెండు స్వర్ణ పతకాలు సాధించారు. పురుషుల 50 మీటర్ల త్రీ పొజిషన్ టీమ్ ఈవెంట్‌లో ఐష్వరి ప్రతాప్ సింగ్, స్వప్నిల్ కుశాలె, అఖిల్ షిరన్ బృందం గోల్డ్ మెడల్ సాధించింది. భారత్ 1,769 పాయింట్లతో ప్రపంచ రికార్డును నమోదు చేసింది. ఇదే విభాగంలో వ్యక్తిగత ప్రదర్శనలోనూ భారత షూటర్లు ఫైనల్‌కు అర్హత సాధించారు.

మిగతా 2లో

## మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించిన రాష్ట్రపతి..

ఢిల్లీ - ప్రభాత సూర్యుడు



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొందింది. ఇప్పటికే లోక్‌సభ, రాజ్యసభల ఆమోదం పొందిన ఈ బిల్లును తాజాగా ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. దీంతో ఇది చట్ట రూపం దాల్చింది. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ బిల్లును 'నారీ శక్తి వందన్ అధినియమ్ పేరుతో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సెప్టెంబర్ 19న లోక్‌సభలో, సెప్టెంబరు 21న రాజ్యసభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఆ బిల్లును రాష్ట్రపతి తాజాగా ఆమోదించడంతో మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరపడినట్లయింది.

## రెండు రోజుల వ్యవధిలో తెలంగాణకు మోడీ



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణతోపాటు దేశంలోని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు త్వరలోనే ఎన్నిక నగారా మోగనుంది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మిజోరం, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణకు సీఈసీ ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు.. పార్టీలు ప్రచార కార్యక్రమాల్లో జోరు పెంచుతున్నారు. బీజేపీ జాతీయ పార్టీ కూడా ఎన్నికలు జరిగే రాష్ట్రాలపై ఫోకస్ పెట్టింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చేపట్టాల్సిన కార్యాచరణపై ఇప్పటికే కీలక సమావేశాలు నిర్వహించింది. ఆ రాష్ట్రాల్లోని బీజేపీ నేతలను మద్దతుగా జాతీయ స్థాయి నాయకులకు కూడా ప్రచారంలో పాల్గొనేలా కార్యాచరణ సిద్ధం చేసింది.ప్రధాని నరేంద్ర మోడీ కూడా.. ఎన్నికల జరిగే రాష్ట్రాల్లో పర్యటించబోతున్నారు. వచ్చే వారం రోజుల్లో... మూడు రాష్ట్రాల్లో ప్రధాని పర్యటించనున్నారు. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ప్రధాని పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఆయా రాష్ట్రాల్లో

మిగతా 2లో...

## గులాబీలో .. అంతర్మథనం



### అడిగిందే తడవు... అపాయింట్ మెంట్స్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. అది కూడా రాజకీయ పరిస్థితులు పార్టీకి ఇబ్బందిగా మారుతుండటంతో ఆయనలో ఉన్న మార్మికత ఇప్పుడు బయట పడుతోంది. అంతేకాదు అసంతృప్తులను స్వయంగా ప్రగతిభవన్‌కు ఆహ్వానిస్తున్నారు. వారిని బుజ్జగిస్తూ పదవుల ఎర వేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ రానుంది. బీఆర్ఎస్ ఇప్పటికే నాలుగు స్థానాలు మినహా మిగిలిన అన్ని స్థానాలకూ అభ్యర్థులను ప్రకటించింది. అయితే టికెట్ ఆశించి భంగపడ్డ వారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వారిని మొదట్లో పెద్దగా పట్టించుకోని అధిష్ఠానం.. క్షేత్రస్థాయిలో వారితో జరుగుతున్న నష్టంతో మేల్కొంది. వారికి పదవుల ఆశచూపి బుజ్జగిస్తోంది. జనగాం, స్టేషన్ ఘన్‌పూర్ సిటింగ్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య విషయంలో ఇదే జరిగింది. అధిష్ఠానం వీరికి టికెట్లు నిరాకరించడంతో.. రాజయ్య ఒక దశలో పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన పార్టీ పెద్దలు ఆ ఇరువురిని ప్రగతి భవన్‌కు పిలిపించి బుజ్జగించారు. ఒకరికి రాష్ట్ర రైతుబంధు సమితి ఛైర్మన్ పదవి, మరొకరికి ఆర్టీసీ ఛైర్మన్ పదవి ఇస్తామని ఆశల హామీ ఇచ్చారు. అలాగే ఇతర

మిగతా 2లో...

## మళ్లీ తిరిగి పంపే యోచనలో ప్రభుత్వం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీ వ్యవహారం తెలంగాణలో కాక రేపుతోంది. పూర్తిగా పొలిటికల్ టర్న్ తీసుకుంటోంది. నామినేటెడ్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలపైనా మరోమారు చర్చించి పూర్తి సమాచారం పంపే అవకాశం లేకపోలేదని అంటున్నారు. వ్యవహారం బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ అన్నట్టుగా మారిపోతోందంటున్నారు. కేసీఆర్ కేబినెట్ ప్రతిపాదించిన రెండు పేర్లను తిరస్కరించారు గవర్నర్ తమిళిసై. దాసోజు శ్రవణ్ , కుర్ర సత్యనారాయణ పేర్లను గవర్నర్ దగ్గరికి పంపింది సర్కార్. అయితే.. ఇద్దరికీ ఆ కోటాలో నామినేట్ అయ్యే అర్హత లేదంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు

మిగతా 2లో...

## టీడీపీలో ఇక అత్తాకోడళ్లే

విజయవాడ- ప్రభాత సూర్యుడు



తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును అరెస్ట్ చేసిన తర్వాత ఆ పార్టీలో పార్టీని నడిపేది ఎవరు అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. దీనికి కారణం నారా లోకేష్‌ను కూడా అరెస్ట్ చేస్తామని వైఎస్ ఆర్‌సీపీ నేతలతో పాటు సీఐడీ చీఫ్ సంజయ్ కూడా పలుమార్లు ప్రక టించారు. ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో నారా లోకేష్ పేరు కూడా పెట్టడంతో అరెస్ట్ ఖాయమని అనుకుం టున్నారు. అందుకే ఇప్పుడు టీడీపీ తరపున ఎవరు ప్రజల్లోకి వెళ్తారన్నది హాట్ టాపిక్ గా మారింది. అయితే ఇప్పుడు నారా భువనేశ్వరితో పాటు నారా బ్రాహ్మణి మాటలతో కాకుండా చేతలతో రాజకీయాలు ప్రారంభించేశారు. చంద్రబాబు అరెస్ట్ అయినప్పటి నుండి రాజమండ్రి క్యాంప్ సైట్ లోనే ఉంటున్నారు. ఇద్దరూ దాదాపుగా ప్రతీరోజూ ఏదో ఓ రాజకీయ ప్రకటన చేస్తున్నరు. ఈ ప్రకటనలు అన్నీ వైరల్ అవుతున్నాయి. నారా బ్రాహ్మణి ఎగ్రెసివ్ గా ప్రజా సమస్యలపై స్పందిస్తున్నారు. ఆమె అంగన్‌వాడి మహిళలు, టీడీపీ మహిళా నేత పరిటాల సునీత పై పోలీసుల వ్యవహరించిన తీరుపై ఘాటుగా స్పందించారు. ఏపీలో శాంతియుతంగా జరుగుతున్న ర్యాలీల్లో ప్రభుత్వ ప్రేరేపిత హింస చూసి షాక్ కు గురవు తున్నానన్నారు. ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీలను అమలు చేయమని అడిగితే అంగన్‌వాడి

మిగతా 2లో...

## సుప్రీం కోర్టులో ఏపీ సర్కార్ కేవియట్ పిటీషన్



విజయవాడ- ప్రభాత సూర్యుడు

చట్ట విరుద్ధంగా తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే అరెస్ట్ చేశారని.. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17ం తనకు వర్తిస్తుందని చంద్రబాబు దాఖలు చేసుకున్న పిటిషన్‌పై వచ్చే నెల మూడో తేదీన సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. అయితే తాజాగా ఏపీ ప్రభుత్వం కూడా కేవియట్ దాఖలు చేసింది. చంద్రబాబు పిటిషన్‌పై తీర్పు ఇచ్చే ముందు తమ వాదన కూడా వినాలని కోరింది. సుప్రీంకోర్టులో చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్లు మొదటగా ద్విసభ్య

మిగతా 2లో...

# అసలేం జరుగుతోంది..!

(మొదటిపేజీ తరువాయి)

పడిపోతున్నారు. పరీక్షను రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇవ్వటంతో సంచలనంగా మారింది. ఈ తీర్పును అప్పీల్ చేస్తూ డివిజన్ బెంచ్ ను కూడా ఆశ్రయించింది టీఎస్పీఎస్సీ. అయితే ఇక్కడ అదే తీర్పు వచ్చింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పు సబబే అని స్పష్టం చేసింది. ఫలితంగా పేపర్ లీకేజీ కారణంగా ఇప్పటికే ఒకసారి పరీక్ష రద్దు కాగా.. పలు కారణాలతో రెండోసారి కూడా ఎగ్జామ్ రద్దు కావటంతో అభ్యర్థులు వాపోతున్నారు.గ్రూప్ 1 పరీక్షను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో?. సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతోంది తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్. హైకోర్టు తాజా తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయనుంది. ఇక తీర్పు తుది కాపీ రాగానే వచ్చేవారంలో అప్పీల్ పిటిషన్ దాఖలు చేసే అవకాశం కనిపిస్తోంది. టీఎస్పీఎస్సీ నిర్ణయంతో చాలా మంది అభ్యర్థుల్లో కొంత ఆశలు చిగురిస్తున్నాయి. హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ? పరీక్షల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే?.గ్రూప్ 1 ప్రక్రియ ముందుకెళ్లటం ఖాయమే. కానీ అలా కాకుండా? ఉన్నత న్యాయస్థానం లేవనెత్తిన అంశాలనే అత్యున్నత న్యాయస్థానం కూడా ప్రస్తావించి.. హైకోర్టు ఆదేశాలను సమర్థిస్తే పరిస్థితేంటన్న చర్చ గ్రూప్ 1 అభ్యర్థుల్లో తెగ జరుగుతోంది.ఇక సుప్రీంకోర్టు కూడా హైకోర్టు నిర్ణయాన్ని సమర్థిస్తే? మళ్లీ ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే?. ఎగ్జామ్ నిర్వహణ కష్టంగానే కనిపిస్తుంది. ఇప్పటికే పలు పరీక్షల తేదీలు ఖరారు కాగా? మరోవైపు వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే ఛాన్స్ ఉంది. దీంతో మళ్లీ ప్రిలిమ్స్ పరీక్ష తేదీలను ప్రకటించటం, నిర్వహించటం అంత సులభమైన ప్రక్రియగా కనిపించటం లేదు. దీనిపై కమిషన్ ఏం చేయబోతుందనేది కూడా అత్యంత కీలకంగా మారింది.

ఇక 2022 ఏప్రిల్ 26న 503 పోస్టులతో తెలంగాణ తొలి గ్రూప్-1 నోటిఫికేషన్ ను టీఎస్పీఎస్సీ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 3,80,202 మంది గ్రూప్ 1 కు అప్లై చేశారు. అదే ఏడాది అక్టోబరు 16న ప్రిలిమ్స్ నిర్వహించగా పేపర్ లీకేజీ వ్యవహారంతో ఈ పరీక్షను టీఎస్పీఎస్సీ రద్దు చేసింది. తిరిగి ఈ ఏడాది జూన్ 11న మళ్లీ గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహించగా... ఇందులో గతంలో అనుసరించిన బయోమెట్రిక్ విధానాన్ని మినహాయించింది. ఈ అంశాన్నే పలువురు అభ్యర్థులు సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయిచటంలో ఈ పరీక్షను తాజాగా న్యాయస్థానం రద్దు చేసింది. రెండోసారి 2,33,248 మంది అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్ష రాశారు. మొత్తంగా 2 లక్షల మందికి పైగా అభ్యర్థులు ప్రిలిమ్స్ పై సుప్రీంలో ఎలాంటి తీర్పు వస్తుందని ఎదురుచూస్తున్నారు.

### రెండు రోజుల వ్యవధిలో

# తెలంగాణకు మోడీ

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు ప్రధాని మోడీ. వచ్చే వారంలో ప్రారంభించాల్సిన ప్రాజెక్టుల వివరాలను సిద్ధం చేయాలని కూడా ఇప్పటికే మంత్రిత్వ శాఖను కోరారు ప్రధాని. దీంతో.. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రాజెక్టులు, కార్యక్రమాల జాబితాను సిద్ధం చేసినట్టు సమాచారం. ఆ కార్యక్రమాల జాబితాలో ఎక్కువగా రోడ్డు, రైల్వే ప్రాజెక్టులే ఉన్నట్టు తెలుస్తోంది. అక్టోబర్ 1న ప్రదాని మోడీ తెలంగాణలో పర్యటించనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. అక్టోబర్ 1న మధ్యాహ్నం ఒకటిన్నరకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకుంటారు ప్రధాని. 1:35గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో మహబూబ్‌నగర్ వెళ్తారు. 2గంటల 10 నిమిషాలకు మహబూబ్‌నగర్ హెలిపాడ్ దగ్గరకు చేరుకుంటున్నారు. 2:15 గంటల నుంచి 2:50 వరకు మహబూబ్‌నగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ఆ తర్వాత 3గంటలకు బహిరంగ సభ వేదిక చేరుకుని.. 4గంటల వరకు సభ వద్దే ఉంటారు. 4గంటల 10 నిమిషాలకు మహబూబ్‌నగర్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు. 4:45కు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్న ప్రధాని.. 4:50కు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ తిరిగి వెళ్తారు. ఆ తర్వాత.. అక్టోబర్ 3న మళ్లీ తెలంగాణ పర్యటనకు వస్తారు ప్రధాని మోడీ. 3వ తేదీన నిజామాబాద్‌లో పర్యటించి.. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. నిజామాబాద్‌లోని జీజీ గ్రౌండ్‌లో ప్రధాని మోడీ సభకు రాష్ట్ర బీజేపీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.అక్టోబర్ 2న మధ్యప్రదేశ్‌లో పర్యటించనున్నారు ప్రధాని మోడీ. గ్వాలియర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఖఓ స్మార్ట్ సిటీ ప్రవేశ ద్వారం, థీమ్ రోడ్, ఎఔఙఅ గ్రౌండ్‌తోపాటు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా గ్వాలియర్‌లోని ఫెయిర్ గ్రౌండ్‌లో బహిరంగ సభ కూడా ఏర్పాటు చేస్తున్నారు మధ్యప్రదేశ్ బీజేపీ నేతలు. ఈ సందర్భంగా లాడ్లీ బ్రాహ్మణ యోజన యొక్క ఐదవ విడత నగదు కూడా విడుదల చేస్తారని సమాచారం. అక్టోబర్ 2వ తేదీనే ప్రధాని మోడీ రాజస్థాన్‌లో పర్యటన కూడా ఉంది. సెప్టెంబరు 25న రాజస్థాన్‌లో పర్యటించారు ప్రధాని మోడీ. వారం రోజుల్లో మరోసారి రాజస్థాన్ వెళు న్నారు. ఈసారి చత్తోస్ గఢ్‌లో పర్యటించనున్నారు ప్రధాని. చిత్తోర్-నీముచ్ రైల్వే లైన్ డబ్లింగ్, దబోక్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తారు. చిత్తోర్‌గఢ్‌లో ప్రధాని మోడీ సభకు సన్నాహాలు కూడా జరుగుతున్నాయని రాజస్థాన్ బీజేపీ నేతలు తెలపారు.

## కేసీఆర్‌కు ఫీవర్

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వైరల్ ఫీవర్ తగ్గకపోడవంతో ఈ రోజు జరగాల్సిన కేబినెట్ భేటీ వాయి?ద డింది. ల శుక్రవారం మధ్యాహ్నం సెక్రటేరియెట్‌లో సీఎం కేసీఆర్ అధ్యక్షతన కేబినెట్ సమావేశం నిర్వహించనున్నట్టు అనధికారికంగా సమాచారం ఇచ్చారు. కేసీఆర్ వైరల్ ఫీవర్‌తో బాధ పడుతున్నారని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. దీంతో కేబినెట్ భేటీని వాయిదా వేసినట్టు తెలుస్తోంది. అక్టోబర్ మొదటి వారంలో తిరిగి కేబినెట్ సమావేశం నిర్వహించే అవకాశం ఉందని ప్రగతి భవన్ వర్గాలు చెప్తున్నాయిఎన్నికల షెడ్యూల్ వచ్చే గడువు దగ్గర పడుతూండటంతో అధికార బీఆర్ఎస్ అందుకనుగుణంగా స్పీడు పెంచుతోంది. ఎలక్షన్ తాయిలాల్లో భాగంగా సీఎం కేసీఆర్ ఓటర్లకు మరిన్ని హామీలివ్వనున్నారు. ఈ హామీలు, తాయిలాలపై చర్చించేందుకోసం ఈనెల 29న రాష్ట్ర మంత్రివర్గం ప్రత్యేకంగా భేటీ కానుంది. ప్రస్తుత సర్కారుకు దాదాపు ఇదే ఆఖరి క్యాబినెట్ కానుంది. ప్రతిపక్ష కాంగ్రెస్ ఇటీవల ఆరు గ్యారెంటీలను ప్రకటించింది. వీటిపై విస్తృత ప్రచాతరం చేస్తున్నారు. వాటికి ధీటుగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను రూపొందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు.

### 2023 ఆసియా

# గేమ్స్‌లో భారత్ సత్తా

(మొదటిపేజీ తరువాయి)

**షూటింగ్‌లోనే భారత్‌కు 17 పతకాలు..!**

మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ టీమ్ విభాగంలో ఇషా సింగ్, పాలక్, దివ్య తడిగోల్ టీం రజతం కైవసం చేసుకుంది. వ్యక్తిగత మహిళల విభాగంలోనూ పాలక్ స్వర్ణం, ఇషా సింగ్ రజత పతకాలు సాధించారు. మొత్తంగా షూటింగ్‌లోనే భారత్‌కు 17 పతకాలు గెలుచుకుంది. ఇందులో ఆరు స్వర్ణాలు ఉండగా.. 6 రజతాలు, 5 కాంస్య పతకాలు ఉన్నాయి.

**పతకాల పట్టికలో 4వ స్థానంలో భారత్...**

టెన్నిస్ డబుల్స్‌లో భారత్‌కు రజత పతకం వచ్చింది. డబుల్స్ విభాగంలో సాకేత్ మైనేని, రామ్‌కుమార్ రామనాథన్ జోడీ సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. రామ్‌కుమార్‌కు ఆసియా క్రీడల్లో తొలి మెడల్ కాగా.. సాకేత్‌కి ఇది మూడోది. ఇప్పటివరకు ఆసియా క్రీడల్లో భారత పతకాల సంఖ్య 30కి చేరింది. ప్రస్తుతం పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానంలో ఉంది.

# టీడీపీలో ఇక అత్తాకోడళ్లే

(మొదటిపేజీ తరువాయి)

కార్మికులపై దాడులు దుర్మార్గమన్నారు. న్యాయం కోసం మహిళా నేతలు శాంతియుతంగా ప్రజాస్వామ్య బద్ధంగా పోరాడుతూంటే.. వారిపై దాడులకు పాల్పడటం శోచనీయమన్నారు. బ్రాహ్మణి సోషల్ మీడియాలో వ్యక్తం చేసిన స్పందనలు క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. రాజమండ్రిలో టీడీపీ క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన రోజు నారా బ్రాహ్మణి మీడియాతో మాట్లాడారు. సూటిగా , స్పష్టంగా ఎక్కడా తడబాటు లేకుండా ఆమె మీడియాకు ఇచ్చిన సమాధానాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. రాజకీయాల్లో రాణించే సామర్థ్యం ఉందన... భయపడే తత్వం కూడా కాదని అందరూ అంచనాకు వచ్చారు. అందుకే నారా బ్రాహ్మణి టీడీపీ తరపున యాక్టివ్ పాలిటిక్స్ లోకి వచ్చేయాలని ఇంతకు మించిన తరుణం ఉండదని అంటున్నారు. క్యాడర్ అభిప్రా యాలపై నారా బ్రాహ్మణికి స్పష్టత ఉందేమో కానీ ఆమె కూడా రాజకీయ ప్రకటనలు ప్రారంభించారు. ప్రజా సమస్యలపై ప్రస్తావించడం ప్రారంభించారు. ఇప్పటికే బ్రాహ్మణి రాజకీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. సంఘీభావం తెలిపేందుకు వస్తున్న నేతలతో రాజకీయాలు చర్చిస్తున్నారు. జనసేన నేతలు వచ్చి మాట్లాడుతున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఐటీ ఉద్యోగులతో మాట్లాడారు. దాదాపుగా ప్రతి రోజూ రాజకీయాలపై మాట్లాడుతున్నారు. లోకేష్ పై తాజాగా కేసు పెట్టారు. ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో ఏ 14గా చేశారు. అందుకే బ్రాహ్మణి ఇక రంగంలోకి దిగాలని నిర్ణయించుకున్నారు. ఇక ముందు ఈ రాజకీయం కంటిన్యూ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నరా?. తెలుగు దేశం పార్టీ చాలా స్పష్టంగా ఉందని.. ఒకరి తర్వాత ఒకరు పది లేయర్ల వరకూ నాయకత్వాన్ని ఖరారు చేసుకున్నారని పార్టీ నేతలంటున్నారు. సందర్భం వచ్చినప్పుడల్లా నారా భువనేశ్వరి స్పీచ్‌లు వైరల్ అవుతు న్నాయి. ఆమె కూడా సందర్భం వచ్చినప్పుడల్లా పార్టీ శ్రేణుల్ని ఉద్దేశించి మాట్లాడుతున్నారు. ఆమె కూడా సూటిగా ..స్పష్టంగా తాను చెప్పాలనుకున్నది చెబు తున్నారు. చంద్రబాబు, లోకేష్ ఇద్దర్నీ బయటకు రాకుండా కేసుల మీద కేసులు పెట్టి జైల్లో పెట్టినా వీరిద్దరూ టీడీపీని విజయానికి దగ్గర చేస్తారని టీడీపీ నేతలు నమ్మకంగా ఉన్నారు.

# గులాబీలో అంతర్మథనం

(మొదటిపేజీ తరువాయి)

నియోజక్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కు రోజురోజుకూ గ్రాఫ్ పెరుగుతుండటం, బీఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతుండటమే ఇందుకు కారణమనే అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. గులాబీ పార్టీలో అంతర్మథనం మొదలైందని, టికెట్లు ప్రకటించినప్పటి ధీమా ఇప్పుడు పూటపూటకూ సడలుతోందని అంటున్నారు. అయినా పైకి మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తప్పులను సరిదిద్దుకునేందుకు పార్టీ పెద్దలు రంగంలోకి దిగుతుండడం, ముఖ్యంగా సీఎం కేసీఆర్ తన వైఖరికి విరుద్ధంగా ఒక్కో మెట్టు దిగుతుండడాన్ని ఉదహరిస్తున్నారు. ఇప్ప టిదాకా 'నేను ఇలాగే ఉంటాను.. నా వైఖరితో నష్టపోయిందేమీ లేదు' అన్న భావనలో ఉన్న సీఎం కేసీఆర్.. ఆ వైఖరితో మొదటికే మోసం వస్తుం దని గ్రహిస్తున్నారని, ముఖ్యంగా కొందరికి అడిగిన వెంటనే అపాయిం ట్‌మెంట్‌ఇచ్చేస్తున్నారని చెబుతున్నారు. గతంలో ఏళ్ల తరబడి ఎదురుచూసినాసీఎం కేసీఆర్ దర్శనం కష్టత రమయ్యేది. ప్రజా గాయకుడు గద్దర్ లాంటివారే 40 సార్లు ప్రయత్నించినా సీఎంను కలవలేకపోయారు. మోత్కుపల్లి నర్సింహులు లాంటి సీనియర్ నేత కూడా ముఖ్యమంత్రిని కలిసేందుకు ఎన్నోసార్లు ప్రయత్నించినా సాధ్యం కాలేదని తాజాగా వాపోయారు. ఇక 2014లో గెలిచినప్పటి నుంచి ఇప్పటిదాకా ప్రగతి భవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌ను ముఖాముఖి కలిసిన ఎమ్మెల్యేలు, ఎంపీలను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు." ప్రగతిభవన్ అంటేనే ఓ దుర్గం అని, పార్టీ ఎమ్మెల్యేలు సైతం అక్కడికి వెళ్లలేని రాజ కోటగా మారిందని, తమ ముఖ్యమంత్రే తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వరని" ఆ పార్టీ నేతలు అంటున్నారంటే అందులో ప్రజా స్వామ్యం ఏ స్థాయిలో ఉందో ఇట్టే అవగతమవుతుంది. అయితే దీనిని చివరి దశలో సరిదిద్దుకునేందుకు పార్టీ పెద్దలు నానా తిప్పలు పడుతున్నారు. ఇప్పుడు అడిగిన వెంటనే అపాయింట్‌మెంట్ ఇస్తున్నా.. ఎన్నికల కోసమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గాల్లో కూడా పార్టీకి తీరని నష్టం కలిగిస్తారనుకున్న వారిని పిలిచి మాట్లాడుతున్నారు. ప్రభుత్వం చివరి దశకు చేరుకున్న సమయంలో.. ఏళ్లుగా భర్తీ చేయని పదవుల పందేరానికి కూడా శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో రెండేళ్లుగా ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు నూతన చైర్మన్, సభ్యులను నియమించారు.పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించే వారి విషయంలో గతంలో సీఎం కేసీఆర్ వైఖరి చాలా కఠినంగా ఉండేది. పార్టీలో ఎక్కడా ధిక్కార స్వరాలు వినిపించేవి కావు. ఒకటీ అరా వినిపించినా.. గంటల వ్యవధిలో ఆ నోళ్లు మూతబడేవి. పార్టీపై, నేతలపై పెద్దలకు అంతలా పట్టుండేది. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. ధిక్కార స్వరాలు వినిపించే వారి జోలికి వెళ్లే సాహసం చేయడం లేదు. ఇంకా చెప్పాలంటే.. అటువంటి నేతలను పదవులిచ్చి మరీ ప్రోత్సహించే సంస్కృతి బీఆర్ఎస్ లో తొలిసారిగా కనిపిస్తోంది. ఉదాహరణకు.. రంగారెడ్డి జిల్లాకు చెందిన పట్నం మహేందర్ రెడ్డి అధిష్ఠానంపై అసంతృప్తితో కాంగ్రెస్ లో చేరేందుకు సిద్ధం కాగా, ఆయనకు మంత్రి పదవి ఇచ్చారు. ప్రజాబలం ఉన్న నేత కావడం, ఆ జిల్లాపై ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో ఆయనపై వేటుకు బదులు.. మంత్రి పదవి ఇచ్చి చల్లబరిచారు. ఇక మంత్రి హరీశ్‌రావుపై, పార్టీ అధిష్ఠానంపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు విషయంలో పార్టీ పెద్దలు మౌనమే వహించారు. చోటా మోటా నేతలే మైనంపల్లిపై స్పందించారు. వాస్తవానికి హన్మంతరావు చేసిన వ్యాఖ్యలు మరే ఇతర నేత చేసినా ఈ పాటికి వేటు పడి ఉండేది. వివిధ రకాల కేసులు కూడా నమోదయ్యేవి. కానీ, మైనంపల్లిపై ఎటువంటి చర్యలూ తీసుకునే సాహసం చేయలేదు. పార్టీ ఎలాగూ చర్య తీసుకునే పరిస్థితి లేకపోవడంతో ఆయనే బీఆర్ఎస్ కు బైబై చెప్పేశారు. మొత్తానికి ఈ పరిణామాలతో భారత రాష్ట్ర సమితి పార్టీలో ఏదో తెలియని భయం ఆవరించిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.. అయితే ఈ మార్పు మొదటి నుంచి ఉంటే ఇంత ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండేది కాదని వారు చురకలు అంటిస్తున్నారు.

### మళ్లీ తిరిగి పంపే

# యోచనలో ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

తమిళిసై. ఈ నిర్ణయంపై భగ్గుమంటోంది బీఆర్ఎస్. మంత్రులు, అధికార పార్టీ ముఖ్య నేతలు గవర్నర్ మీద నేరుగానే విమర్శ నాస్త్రాలు సంధిస్తున్నారు.ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ.. దాసోజు శ్రవణ్, సత్యనారాయణ రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు. కళలు, సాహిత్యం, సైన్స్ రంగంలో వీరిద్దరూ పెద్దగా కృషి చేయలేదు. గవర్నర్ కోటాలో నామినేట్ చేసే అర్హతలు వీళ్లకు లేవు. ఆర్టికల్ 171(5) ప్రకారం అభ్యర్థుల ఎంపిక జరగలేదు అని అన్నారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఇటీవలే బీజేపీలో చేరారు. అనంతరం, కొన్ని పరిణామాల నేపథ్యంలో అధికార బీఆర్ఎస్ పార్టీలో చేరిపోయారు. వెనుకబడిన వర్గాల నాయకుల పేర్లను తిరస్కరించారంటూ పొలిటికల్ కలర్ ఇస్తున్నారు. దీంతో ఇప్పుడు ప్రభుత్వం ఏం చేస్తుందోనన్న ఆసక్తి కూడా పెరుగుతోంది రాజకీయ వర్గాల్లో. ఆల్రెడీ వ్యవహారం పొలిటికల్ టర్న్ తీసుకున్నందున మరోసారి అవే పేర్లను తిప్పి పంపి మళ్లీ తిరస్కరిస్తే.. రాజకీయంగా రాష్ట్రంలో బీజేపీని టార్గెట్ చేయాలనుకుంటున్నట్టు అంచనా వేస్తున్నారు.చాలా రోజుల నుంచి రాజ్ భవన్, ప్రగతి భవన్ మధ్య మాటల మంటలు పుడుతున్నాయి. అయితే ఇటీవలే సచివాలయంలో దేవాలయాలు,మసీదు,చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమాలకు హాజరయ్యారు గవర్నర్. దాంతో వివాదాలు సద్దుమణిగాయని అనుకున్నారు అంతా. మళ్ళీ వ్యవహారం మొదటికే రావడంతో గవర్నర్ తీరుపై గుర్రుగా ఉందట అధికార పార్టీ. ఈ వ్యవహారంపై న్యాయ నిపుణులతో చర్చించాక అడుగులు వేయాలనుకుంటున్నట్టు తెలిసింది. ఇవికాకుండా ఒకవేళ గవర్నర్ కొత్త పేర్లు పంపితే? తప్పు చేశామని ఒప్పుకున్నట్టు, వెనక్కు తగ్గినట్టు అవుతుందని, అందుకే ఈ రెండు పేర్లనే మరోసారి పంపాలని అనుకుంటున్నట్టు గులాబీ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే.. ఇదే సమయంలో మరో వాదన సైతం రాజకీయ వర్గాల్లో బలంగా ఉంది. ప్రస్తుతం బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనంటూ విస్తృతంగా ప్రచారం చేస్తోంది కాంగ్రెస్ పార్టీ. లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయకపోవడమే అందుకు ఉదాహరణ అంటూ జనంలోకి వెళ్తోంది. ఆ ప్రచారాన్ని ప్రజలు కూడా నమ్ముతున్నారన్న అనుమానంతోనే? రెండు పార్టీలు నేను కొట్టినట్టు నటిస్తాను, నువ్వు ఏడ్చినట్టు నటించు అన్నట్టుగా అవగాహనతో పనిచేస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి.మరీ ముఖ్యంగా వివిధ నియోజకవర్గాల్లో ఇన్నాళ్ళు బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్న ముస్లిం ఓట్ బ్యాంక్ క్రమంగా కాంగ్రెస్ వైపు మళ్ళుతున్నట్టు అనుమానాలు ఉన్నాయట. అందుకే రెండు పార్టీలు పైకి కయ్యం పెట్టుకుంటున్నట్టే కనిపిస్తున్నాయని, ఎమ్మెల్సీ వివాదం కూడా అందులో భాగమేనన్నది విమర్శకుల మాట. ఎన్నికలకు టైం దగ్గరపడుతున్నందున ఈ వ్యవహారం ఏ మలుపు తీసుకుంటుందో చూడాలి.

### సుప్రీం కోర్టులో ఏపీ సర్కార్

# కేవియట్ పిటీషన్

(మొదటిపేజీ తరువాయి)

ధర్మాసనానికి వెళ్లగా.. నాట్ బిఫోర్ మీ అంటూ న్యాయమూర్తి భట్టి ప్రకటించారు. దీంతో చంద్రబాబు తరలు లాయర్ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ దగ్గర మెన్షన్ చేశారు. ఆయన పిటీషన్ ను పరిగణలోకి తీసుకుంటూ.. చంద్రబాబు తరపు లాయర్ల వాదనలు విన్నారు. క్వాష్ పిటీషన్ కొట్టివేయాలని.. చంద్రబాబుపై నమోదైన కేసులను కొట్టివేయాలని వాదించారు. చంద్రబాబు తరపు లాయర్ల వాదనలు విన్న చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ .. కేసును మరో బెంచ్ కు బదిలీ చేస్తున్నానని.. అక్టోబర్ 3వ తేదీన ఆ బెంచ్ వాదనలు వింటుందని తీర్పు ఇచ్చారు. దీంతో చంద్రబాబు కేసు వాయిదా పడినట్లు అయ్యింది. సుప్రీంకోర్టులో తర్వాత వర్కింగ్ డే ఆ రోజే. అప్పటి వరకూ సుప్రీంకోర్టుకు సెలవులుఉన్నాయి. చీఫ్ జస్టిస్ బెంచ్ ముందు మెన్షన్ చేసిన సమయంలో సీఐడీ తరపు లాయర్ రంజిత్ కుమార్ ఇప్పుడు వాదనలు వింటున్నారా అని సీజేఐని ప్రశ్నించారు. ఆ సమయంలో మీ వాదనలు కూడా వింటామని సీజేఐ చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వం కూడా కేవియట్ దాఖలు చేసి.. తమ వాదనలు కూడా వినాలని కోరడంతో.. మూడో తేదీన సుదీర్ఘంగా వాదనలు సాగే అవకాశాలు ఉన్నాయి. కేవియట్ పిటిషన్ అంటే సెక్షన్ 148ఏ సివిల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం పైన కోర్టులో అంటే ఏ కోర్టులో అయితే గెలుస్తారో ఆ పైన ఉండే కోర్టులో కేవియట్ పిటిషన్ వేస్తుంటారు. కేవియట్ అంటే కేసు వేసిన వారు అవతల పార్టీ వారికి నోటీసు ఇచ్చి కోర్టు ముందు హాజరు కావాల్సి ఉంటుంది. అప్పుడు ఆ కోర్టు ఆ కేసు ఏంటనేది వింటుంది. తదనుగుణంగా విచారణ చేసి ఇవ్వాల్సిన మధ్యంతర ఉత్తర్వులు ఇస్తుంది. కేవియట్ పిటిషన్ లైఫ్ 3 నెలలు ఉంటుంది. ఇలా కేవియట్ పిటిషన్‌ను ఉపయోగించుకోవచ్చని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు.స్కిల్ స్కామ్ లో టీటీడీ అధినేత చంద్రబాబు అరెస్ట్ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే హైకోర్టులో ఊరట లభించకపోవటంతో? సు?ప్రీంకోర్టును ఆశ్రయించారు చంద్రబాబు. అయితే ఇక్కడ కూడా వాయిదా పడింది. చంద్రబాబు దాఖలు చేసుకున్న క్వాష్ పిటిషన్‌పై విచారణను అక్టోబరు 3వ తేదీకి వాయిదా వేసూ ఆదేశాలు ఇచ్చింది అత్యున్నత న్యాయస్థానం. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఎ కింద గవర్నర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని చంద్రబాబు ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. క్వాష్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ చంద్రబాబు శనివారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. త్వరలో చంద్రబాబు పిటిషన్ మరోసారి విచారణకు వచ్చే అవకాశం ఉంది.

## సంపాదకీయం

# భయపెడుతున్న కొత్త వేరియంట్లు

ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ ఏదో ఒక మూలన కొత్త వేరియంట్లతో ప్రజల ముందుకు వస్తూనే ఉంది. అయితే ఇప్పుడు ప్రపంచానికి మరొక వైరస్ ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది కోవిడ్ కంటే ఘోరంగా ఉండబోతోందని అంటున్నారు. గతంలో వచ్చిన స్పానిష్ ఫ్లూ మాదిరిగా ఈ కొత్త వైరస్ 50 మిలియన్ల మంది ప్రాణాలని తీసేస్తుందని అంచనా వేస్తున్నారు. మన కంటికి కనిపించకపోయినా అనేక రకాల వైరస్ లు కొత్త రూపాన్ని సంతరించుకుంటూ తిరుగుతూనే ఉన్నాయి. అవన్నీ మానవులకు ముప్పు కలిగించవు. కానీ కొన్ని మహమ్మారిని ప్రేరేపించే వేలాది రకాల వైరస్ లు పరిణామం చెందుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో కొవిడ్–19 కన్నా భయంకరమైన మహమ్మారి ప్రపంచాన్ని చుట్టుముడుతుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. స్పానిష్ ఫ్లూతో కోట్లాది మంది చనిపోయినట్టే, ఈ కొత్త వైరస్ కారణంగా కనీసం 5 కోట్ల మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉన్నదని బ్రిటన్ వ్యాక్సిన్ టాస్క్‌ఫోర్స్‌కు నేతృత్వం వహించిన సైంటిస్టు కేట్ బ్రిఘం హెచ్చరించారు. జంతువుల్లో వైరస్ విస్తరిస్తుందని, మ్యుటేషన్లు ఏర్పడి మానవాళికి పెద్ద సవాల్‌గా మారుతుందని తాను రాసిన ఓ పుస్తకంలో బ్రిఘం వివరించారు. ఈ పుస్తకానికి వ్యాక్సిన్ నిపుణుడు టిమ్ హ్యామ్స్ సహ రచయితగా ఉన్నారు. 'వేలాది రకాల వైరస్‌ల నుంచి మహమ్మారి ప్రబలేందుకు అవకాశముంది. ఇందులో 25 వైరస్ కుటుంబాలను సైంటిస్టులు గుర్తించారు. ప్రతి కుటుంబంలో వేలాది రకాల వైరస్‌లుంటాయి. దీంట్లో ఏదో ఒక వైరస్ వల్ల మహమ్మారి ప్రబలే అవకాశముంది' అని టిమ్ హ్యామ్స్, బ్రిఘం తెలిపారు. భవిష్యత్తులో మహమ్మారి రాబోతున్నదని డబ్ల్యూహెచ్‌వో 2018లో హెచ్చరించింది. వైరస్‌ను 'డిసీజ్ ఎక్స్'గా పేర్కొన్నది. ఎబోలా, హెచ్‌ఐవీ–ఎయిడ్స్, కొవిడ్–19 వైరస్‌లు తొలుత జంతువుల్లో ప్రవేశించి, ఆ తర్వాత జంతువుల నుంచి మానవులకు సోకాయి. డిసీజ్–ఎక్స్ కూడా అదేవిధంగా ఉండొచ్చునని సైంటిస్టులు భావిస్తున్నారు. అత్యధికంగా మరణాల రేటు కలిగిన ఎబోలా, బర్డ్ ఫ్లూ, మెర్స్.. వైరస్‌లనే అరికట్టాం, రాబోయే మహమ్మారిని సులభంగా ఎదుర్కొనవచ్చునన్న అభిప్రాయాన్ని బ్రిగం, హేమ్స్ కొట్టిపారేశారు. జంతువుల నుంచి, ముఖ్యంగా గబ్బిలాల నుంచి వైరస్‌లు మానవులకు సోకుతుండటంపై పరిశోధనలు చేసి, 'బ్యాట్‌వుమన్'గా ప్రసిద్ధి చెందిన చైనీస్ వైరాలజిస్ట్ షి ఝెంగ్లి సంచలన హెచ్చరిక చేశారు. భవిష్యత్తులో మరో కొత్త కరోనా వైరస్ పుట్టుకురావొచ్చని, దీనిని ఎదుర్కొనేందుకు ప్రపంచం సిద్ధంగా ఉండాలని తెలిపారు. వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి చెందిన షి బృందం 40 కరోనా వైరస్ జాతుల వల్ల మానవులపై పడే ప్రభావంపై అధ్యయనం చేసింది. వీటిలో దాదాపు సగం వైరస్ జాతులు అత్యంత ప్రమాదకరమైనవని గుర్తించింది. ఇప్పటి వరకు శాస్త్రవేత్తలు 25 రకాల వైరస్ కుటుంబాల గురించి తెలుసుకున్నారు. వాటిలో ప్రతి ఒక్కటి వందలు లేదా వేల మ్యూటేషన్ ని కలిగి ఉన్నాయి. వీటిలో ఏదైనా కూడా మహమ్మారిని కలిగించే అవకాశం ఉందని పరిశోధకులు వెల్లడించారు. కోవిడ్ మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 20 మిలియన్ల మందిని చంపింది. అదృష్టవశాత్తు వైరస్ సోకిన వారిలో ఎక్కువ మంది కోలుకోగలిగారు. ఎబోలా మరణాల రేటు 67 శాతంగా ఉంది. తర్వాత బర్డ్ ఫ్లూ 60 శాతం వచ్చింది. మెర్స్ కూడా 34 శాతం వరకి ప్రజలకి సోకింది. అందుకే కొత్తగా వచ్చే తదుపరి మహమ్మారి ఎలా ఉంటుందో ఊహించడం కష్టమేనని నిపుణులు తెలిపారు. అయితే డబ్ల్యూహెచ్ఓ కి చెందిన నిపుణులు మెక్ కాలీ మాట్లాడుతూ తదుపరి మహమ్మారికి కారణమయ్యేది భయంకరమైన స్పానిష్ ఫ్లూ లాంటిది కావచ్చని హెచ్చరించారు. కోవిడ్ వ్యాప్తి చెందినప్పటి నుంచి శాస్త్రవేత్తలు తదుపరి మహమ్మారికీ కారణమయ్యే ఇతర ప్రమాదకరమైన వైరస్ కోసం శోధిస్తున్నారు. ఇది స్పానిష్ ఫ్లూ మాదిరిగా కేసుల పెరుగుదల, మరణాల సంఖ్య ఉండవచ్చని భావిస్తున్నారు. స్పానిష్ ఫ్లూ అనేది 1918 లో వచ్చింది. ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మందికి సోకింది. పక్షుల నుంచి వచ్చిందని అంటారు. 1918 నుంచి 1919 వరకు 50 మిలియన్ల మంది దీని బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచ యుద్ధంలో మరణించిన వారి సంఖ్య కంటే ఈ వైరస్ వల్ల చనిపోయిన వాళ్ళ సంఖ్య రెండు రెట్లు ఎక్కువ. అడవి, పెంపుడు పక్షుల నుంచి ఉద్భవించిందని కొందరు వాదిస్తారు. మరికొందరు పందుల నుంచి వచ్చిందని చెప్తారు. చైనా, ఫ్రాన్స్, యూఎస్, బ్రిటన్ సహ అన్నీ ప్రాంతాలని ఇది కబళించింది. కరోనా వైరస్ మాదిరిగా కాకుండా స్పానిష్ ఫ్లూ యువతలో ముఖ్యంగా ఐదు కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలలో, 20–40 సంవత్సరాల వయసు వారికి సోకింది. ఇది అత్యంత శక్తివంతమైనది. వ్యాధి లక్షణాలు కనిపించిన 24 గంటల్లోపే ఆరోగ్యంగా ఉన్న రోగి ప్రాణాలు కూడా తీసేస్తుంది. న్యుమోనియా, శరీరం మీద బొబ్బలు, ముక్కు నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఊపిరితిత్తులు పని చేయడం ఆగిపోతుంది.

## రామగిరి ఖిల్లాపై సాహితీ స్నేహయాత్ర

**కమాన్ పూర్ – ప్రభాతసూర్యుడు:**
నిత్యం విధినిర్వహణలో తీరిక లేకుండా గడిపే అధికారులు రామగిరి ఖిల్లా ప్రకృతి రమణీయ ప్రదేశాన్ని సంధర్శించి ఉల్లాసంగా గడిపారు. పెద్ధపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్ ఆధ్వర్యంలో అధికారులు రామగిరి సాహితి స్నేహయాత్ర–3 పేరిట పెద్దపల్లి జిల్లాలోని రామగిరి మండలంలోని రామగిరి ఖిల్లాను సందర్శించారు. ఈ సధర్భంగ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలకు చెందిన దాదాపు 150 మంది అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, కవులు కళాకారులు, రచయితలు, పెద్ద పల్లి జిల్లాకు చెందిన టీం లీడర్స్ సట్టు కనుకయ్య ,జ్యోతి కవులు కూచన మల్లయ్య మహర్షి, నూనెరాజేశం, బియ్యని తిరుపతి, తదితర కవులు రామగిరి ఖిల్లాను సందర్శించారు, ఈ కార్యక్రమంలో పెద్దపల్లి అధనపు జిల్లాకలెక్టర్ తో పాటు మంథిని ఆర్డీవో హనమ నాయక్ తదితరులు ఖిల్లాపై శత్రుదుర్భేద్యమైన పురాతన కోటలు, కట్టడాలు ప్రకృతి సౌందర్య ప్రాంతలను సందర్శించారు. బేగంపేట గ్రామ శివారు నుంచి కాలినడకన ఖిల్లాను ఎక్కుతూ అద్భుతమైన కట్టడాలు దర్వాజలు, బురుజులు, శిల్పాలు, కొలనులు తిలకించా రు. చవరిగా ఖిల్లాపై శ్రీ సీతారామ చంద్రులను దర్శించుకుని తిరిగి రత్నాపూర్ నుండి కిందకు దిగారు.

# సెస్ విద్యార్దుల హస్టల్ ను ప్రారంభించిన మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**
బేగంపేట్ లోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ – సెస్ లో విద్యార్థునుల వసతి గృహాన్ని మంత్రి హరీశ్ రావు శుక్రవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రూ. 5 కోట్లతో హాస్టల్ అద్భుతంగా నిర్మించారు. కార్పొరేట్ స్థాయిలో ఉంది. ఎకో ఫ్రెండ్లీ, గ్రీన్ కాన్సెప్ట్ విధానంలో నిర్మించారు. గతేడాది ఫిబ్రవరిలో శంకుస్థాపన చేసుకొని, ఏడాదిలో పూర్తి చేసుకున్నాం. జాతీయ స్థాయిలో సేస్ కు మంచి పేరు ఉంది. హాస్టల్ లో 19 గదులు ఉన్నాయి. 40 మంది వరకు ఉండవచ్చు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వం సెస్ ను ఎంతగానో ప్రోత్సహిస్తున్నది. రాష్ట్ర ఆర్థిక, సామాజిక స్థితిగతుల మీద అధ్యయనాలు చేస్తూ సెస్ ఎప్పటికపుడు విలువైన సూచనలు చేస్తున్నది. జాతీయ స్థాయిలో ఇక్కడి పీహెచ్డీ కోర్సుకు డిమాండ్ ఉంది. వివిధ రాష్ట్రాల నుండి చేరుతున్నారు. వీరి అవసరాల నిమిత్తం రు. 5 కోట్లతో బాలికల వసతి గృహం ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. సమగ్రమైన ఆర్థిక, సామాజిక అధ్యయనం ఉన్నప్పుడే ఏ రాష్ట్రం అయినా, దేశం అయినా పురోగతి చెందుతుంది. ఆ ఫలితాల ఆధారంగా మంచి పరిపాలన అందించడం సాధ్యం అవుతుంది. ప్రభుత్వ విధానాలు, పథకాలు రూపకల్పనలో, అమలు చేయడంలో సామాజిక అధ్యయనాలు ఎంతో అవసరం. సీఎం కేసీఆర్ ఒక పథకం అమలు చేసే ముందు ప్రజా కోణంలో ఆలోచిస్తారు. అందుకే అవి విజయవంతం అవుతున్నాయి. దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. కళ్యాణ లక్ష్మి బాల్య వివాహాలను తగ్గించింది. పార్లమెంట్ చట్టాలు చేయలేనిది పథకం చేసిందని అన్నారు. కేసీఅర్ కిట్ వల్ల వంద శాతం ఇన్స్టిట్యూషనల్ డెలివరీలు జరుగుతున్నాయి. కిట్ వల్ల ట్రాకింగ్ సిస్టం లోకి తెచ్చాం. నాడు 30 శాతం ఉంటే, నేడు ప్రభుత్వ ఆసుపత్రి డెలివరీలు 76శాతం జరుగు తున్నాయి. మిషన్ భగీరథ వల్ల సురక్షిత తాగునీరు అందుతున్నది. తద్వారా సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయి. నాడు ప్రజలు ఎంతో ఇబ్బంది పెడేవారు. తాగు నీటి సమస్య నేడు ప్రజలకు లేకుండా పోయింది. హైదరాబాద్ లో నీటి కోసం ఎంతో ఇబ్బంది. ఇప్పుడు అలాంటివి లేవు. సీఎం కేసీఆర్ ఆలోచన వల్ల గుణాత్మక మార్పు సాధ్యం అయ్యింది. ప్రభుత్వ పాలసీలు సామాజిక పరిస్థితుల ఆధారంగా కల్పన చేయాల్సి ఉంటుంది. అప్పుడే అవి అనుకున్న ఫలితాలు ఇస్తాయి. సెసు, అధ్యయనాలు ప్రభుత్వాలకు వెన్నెముకగా పని చేస్తుంది. మా పూర్తి సహకారం ఉంటుంది. సెస్సు సేవలను మరింత వినియో గించుకుంటామని అన్నారు.



# నిండు కుండలా కడెం ప్రాజెక్టు


**అదిలాబాద్ – ప్రభాత సూర్యుడు :**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. గత వారం రోజులుగా జిల్లాలోని కొమరం భీమ్ జిల్లా, మంచిర్యాల, నిర్మల్, అదిలాబాద్ జిల్లాలో అక్కడక్కడ వర్షం కురుస్తూనే ఉంది, వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం గురువారం జిల్లాలో భారీ వాన కురిసింది. ఓవైపు వినాయక నిమజ్జనం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది, నిమజ్జన కార్యక్రమంలో వర్షం కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అధికారులు ఆ వైపు చర్యలు చేపడు తున్నారు. ఇదిలా ఉంటే బోథ్, ఖానాపూర్ మండలం, కొమరం జిల్లాలో పలుచోట్ల గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఎగువ ప్రాంతాల నుండి వరద రావడంతో జిల్లాలోని ప్రాజెక్టులు నిండుకుండలా కనిపిస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సత్నాల, ముత్తడి వాగు, వట్టి వాగు, స్వర్ణ ప్రాజెక్ట్, గడ్డన ప్రాజెక్ట్, కడం ప్రాజెక్ట్, తదితర చెరువులు నిండుకుండలా కనిపిస్తున్నాయి. అధికారులు ముందు జాగ్రత్తగా ప్రాజెక్టుల వద్దనే విధులు కొనసాగిస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరును పరిశీలిస్తూ గేట్లు లేపి కిందికి వదులుతున్నారు. ఉమ్మడి జిల్లాలో కురిసిన వర్షంతో పాటు ఎగువ ప్రాంతంలో వర్షం కారణంగా వచ్చే వరదను ప్రాజెక్టు గేట్లు తెరిచి నీటిని విడుదల చేస్తున్నారు. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులో 700 అడుగుల సామర్థ్యం ఉండగా 697 అడుగులు నిండుగా ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తున్నకారణంగా ప్రాజెక్టు గేటు ఒకటి తెరిచి 2200 క్యూసెక్కుల నీరును బయటికి పంపిస్తున్నారు. అదేవిధంగా సారంగాపూర్ మండలంలోని స్వర్ణ జలాశయంలో ఒక గేటు తెరిచి 1000 క్యూసెక్కుల నీటిని బయటికి పంపిస్తున్నారు. ముథోల్ మండలం గడ్డన ప్రాజెక్టులో పూర్తి సామర్థ్యం 358 అడుగులు ఉండగా 357లకు నిండి ఉంది. ఎగువ నుండి వస్తున్న నీరును ప్రాజెక్టు ఒక గేటు తెరిచి 3000 క్యూసెక్కుల నీరును బయటకు పంపిస్తున్నారు. కొమురం భీం ప్రాజెక్టులో 243 అడుగుల నీటి సామర్థ్యం ఉండగా 237 అడుగుల నీరు నిండుకుంది. ఈ ప్రాజెక్టులో ఒక గేటు ద్వారా 1250 క్యూసెక్కుల నీరు బయటకు పంపిస్తున్నారు. రెండు మూడు రోజులుగా వర్షం కురవడంతో జిల్లాలోని పలు చోట్ల ఇండ్లు కూలిపోయాయి, నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం కోట్ల బీ గ్రామంలో బుధవారం దాసరి ముత్యం అనే వ్యక్తి ఇల్లు కుప్పకూలిపోయింది. ప్రమాద సమయంలో భార్య, పిల్లలు పరుగెత్తి ప్రాణాలను కాపాడుకున్నారు. సోన్ మండలం గ్రామ నివాసి రవి పశువులను తీసుకెళ్లి కుర్రులో మేపుతుండగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేటు ద్వారా నీరు విడుదల కావడంతో అక్కడే ఇరుక్కుపోయారు. వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

# నల్గోండలో లడ్డూ పాలిటిక్స్

**నల్గోండ–పభాత సూర్యుడు :**
వినాయక చవితి సందర్భంగా నల్లగొండ జిల్లాలో ఆసక్తికరమైన రాజకీయాలు చోటు చేసుకున్నాయి. గణేష్ మండపాలు నెలకొల్పడం నుంచి వినాయక విగ్రహాలను ఇవ్వడం వరకు జోరుగా రాజకీయం జరిగింది. జిల్లా కేంద్రంలోని పాతబస్తీలో ఒకటో నెంబరు గణేష్ మండపానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. నిమజ్జనానికి శోభాయాత్ర ఇక్కడి నుంచే మొదలవుతుంది. రాజకీయ నాయకుల, ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు అంతా ఇక్కడ పూజలు చేయడం ఆనవాయితీ. నల్లగొండ పాతబస్తీలోని ఒకటో నెంబరు మండపంలో విగ్రహ ఏర్పాటు కోసం దాతల నడుమ పోటీ ఉంటుంది. ఈ సారి సుమారు పద్నాలుగు మంది దాతలు పోటీ పడడంతో డ్రా తీశారు. స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, బీఆర్‌ఎస్ రెబల్ నాయకుడు పిల్లి రామరాజు యాదవ్, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇలా.. వివిధ పార్టీలకు చెందిన పద్నాలుగు మంది పోటీ పడితే డ్రా తీయడంతో.. ఈ సారి విగ్రహ దాతగా ఎంపీ కోమటిరెడ్డి పేరు డ్రాలో వచ్చింది. దీంతో లడ్డూను దక్కించుకేనేందుకు పోటీ ఏర్పడింది. అంతేకాదు.. గణేష్ ను చేతిలోని లడ్డూకూ ఎంతో ప్రాముఖ్యం ఉంటుంది. ప్రతీ ఏటా పాటలో ఈ లడ్డూను దక్కించుకోవడానికి పోటీ ఉంటుంది. తెలంగాణ వ్యాప్తంగా హైదరాబాద్ లోని బాలాపూర్ గణేష్ లడ్డూకు పేరు ప్రఖ్యాతలు ఉంటాయి. ఏటేటా ఇక్కడి లడ్డూ వేలం పాటలో లక్షల్లో ధర పలుకుతుంది. ఈ సారి కూడా బాలాపూర్ లడ్డూ రూ. 27లక్షలకు దక్కించుకున్నారు. అయితే.. ఇది ఎంత మాత్రం రికార్డు ధర కాదని నల్లగొండ పాతబస్తీ గణేష్ నిరూపించారు. ఇక్కడ జరిగిన లడ్డూ వేలం పాటలో ఏకంగా రూ. 36 లక్షలకు కరణ్ జయరాజ్ అనే భక్తుడు దక్కించుకున్నారు. ఇంత ధర పలకడం ఇదే తొలిసారి కాగా, తెలంగాణ లో రెండో అతి ఎక్కువ ధరగా చెబుతున్నారు. కాగా, హైదరాబాద్ బండ్లగూడా రిచ్ మండ్ విల్లాలో గణేష్ లడ్డూ రూ1.26 కోట్లు రికార్డ్ ధర పలికినట్లు సమాచారం. కాగా, నల్లగొండ పాతబస్తీ వినాయకుడి లడ్డూకు ఇంత ధర పలకడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని చెబుతున్నారు. మునుపెన్నడూ లేని రీతితో నల్లగొండ పాతబస్తీ గణేష్ లడ్డూ రూ. 36 లక్షల ధర పలకడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బీఆర్‌ఎస్ అసమ్మతి నాయకుడు పిల్లి రామరాజు యాదవ్ తమ్ముడు పిల్లి క్రిష్ణం రాజు రూ. 31 లక్షల దాకా పాటపాడి వెనక్కితగ్గారు. గతేడాది ఈ సోదరులిద్దరూ పాతబస్తీ గణేష్ లడ్డూను దక్కించుకున్నారు. ఈ సారి ఎన్నికల ఏడాది కావడంతో ఒక ప్రజాప్రతినిధి తన సెంటిమెంట్ కోసం తెరవెనుక ఉండి ఈ పాట పాడించారని ప్రచారం జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో తనకు కలిసి రావాలంటే లడ్డూను దక్కించుకోవాలని వచ్చిన సూచన మేరకే అత్యధిక ధర పెట్టి లడ్డూను దక్కించుకున్నారని అంటున్నారు. లడ్డూ వేలం పాటలో పాల్గొంది కరణ్ జయరాజ్ అనే భక్తుడే అయినా.. ఆయనతో పాట పాడించింది మాత్రం ఓ ప్రజాప్రతినిధిగా తెలుస్తోంది.

# రాష్ట్రంలో గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ రూ.16,650 కోట్ల పెట్టుబడి

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి జాతీయ అంతర్జాతీయ కంపెనీలు క్యూకడుతున్నాయి. తాజాగా గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అయిన అడ్వెంట్ ఇంటర్నేషనల్ రాష్ట్రంలో రూ. 16,650 కోట్ల పెట్టుబడి పెట్టడానికి ముందుకువచ్చింది. ఈ మేరకు కంపెనీ ఎండీ పంకజ్ పట్వారీ సంస్థ ప్రతినిధులు హైదరాబాద్‌లో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సంస్థ విస్తరణ, పెట్టుబడి



కార్యకలాపాలను కేటీఆర్‌కు వివరించారు.

ఈనేపథ్యంలో సంస్థ పెట్టుండిపై మంత్రి కేటీఆర్ సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఆర్ అండ్ డీ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇది ఫార్మా, లైఫ్ సైఫ్‌సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ వృద్ధికి సంకేమని చెప్పారు. అడ్వెంట్ ఇంటర్నేషనల్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలుగా సహకరిస్తామని వెల్లడించారు.

## గున్‌గల్ గ్రామ అభివృద్ధి పనుల కోసం 27 లక్షల రూపాయలు మంజూరు

**- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**



**యాచారం:-ప్రభాత సూర్యుడు:** యాచారం మండల పరిధిలోని గున్ గల్ గ్రామంలో అభివృద్ధి పనులకు 20 లక్షలు ఓపెన్ డ్రైనేజ్ మరియు కూరగాయల మార్కెట్ యార్డ్ కు 5లక్షల రూపాయలు మరియు 2 లక్షల రూపాయలు (ఎస్టి) ఎరుకల కమ్యూనిటీ హాల్ కి ప్రొసీడింగ్లు ఇచ్చారు . ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి, సర్పంచ్ ఇంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రగతి నివేదన యాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మా గ్రామానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించినందుకు బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ తోటి రెడ్డి రాజేందర్ రెడ్డి , సర్పంచ్ కాశమల్ల ఇందిర శ్రీనివాస్, ఉప సర్పంచ్ భీమ్, యాదవ్ వి ఎస్ ఎస్ చైర్మన్ కుంటి నర్సింహా, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు అచ్చన్న రమేష్, ప్రధాన కార్యదర్శి కుంటి శ్రీకాంత్, బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు కొత్త రుణాలు మంజూరు

**- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం - ప్రభాతసూర్యుడు:** ఇబ్రహీంపట్నం మండలంలోని మంగళపల్లి పటేల్ గూడా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట రుణాలు పొందిన సభ్యులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి అసలు ,వడ్డీ చెల్లించుకోవాలని అన్నారు. ఇలా చెల్లించిన వారికి మళ్లీ అప్పులు ఇస్తామని తెలిపారు. సంఘంలో లాకర్ సదుపాయం కూడా ఉందన్నారు. రుణమాఫీ అయిన 37 మంది రైతులకు కొత్త రుణాలు మంజూరు చేశారు. తదనంతరం రైతులకు రుణమాఫీ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ మంచిరెడ్డి మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఎంపీపీ కృపేష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు వెంకటరమణ రెడ్డి, సెక్రటరీ మాధవి, డైరెక్టర్లు యాదయ్య, బాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లింగారెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఓంకారేశ్వర కాలనీలో నూకం కృష్ణ

**- మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం**



**యాచారం:-ప్రభాత సూర్యుడు :**

యాచారం మండలంలోని నంది వనపర్తి గ్రామంలో ఓంకారేశ్వర కాలనీలో అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పిటిసి చిన్నోళ్ళ జంగమ్మ - యాదయ్య, పిఎసిఎస్ ఛైర్మన్ రాజేందర్ రెడ్డి ,గ్రామ సర్పంచ్ ఉదయశ్రీ రవీందర్ రెడ్డి , బి ఎన్ ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ శేఖర్ రెడ్డి ,రైతు సమన్వయ కమిటీ చైర్మన్ కొంగళ్ల జోగిరెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి విఘ్నేశ్వరుని కృప,ఆశీస్సులు,గ్రామ ప్రజలందరికీ అందేలా చూడాలని మొక్కులు చెల్లించకున్నారు అలాగే ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,యువజన సంఘాల అధ్యక్షులు,కార్యదర్శులు,ఓంకారశ్వరా కాలనీ అధ్యక్షులు నూకం సాయి కిరణ్, ఉపాధ్యక్షులు ఎడ్ల పవన్, ప్రధాన కార్యదర్శి ముక్తల రాజు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 10 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమికి శఠగోపం

**- 12 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జాకు యత్నం**
**- ఎలాంటి నిర్మాణాలు లేకున్నా జీవో 59 క్రింద దరఖాస్తు**
**- క్రాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కు ఫిర్యాదు**



**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాతసూర్యుడు:** గత 35 సంవత్సరాలుగా క్రాంతి యువజన సంఘం ఆధీనంలో ఉన్నటువంటి 12 గుంటల భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని క్రాంతి యువజన సంఘం నాయకులు ఇబ్రహీంపట్నం ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం పసుమాముల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్451లో ఉన్నటు వంటి 12 గంటల ప్రభుత్వ భూమిలో ఆరు గుంటల స్థలం పసుమాముల గ్రామానికి చెందినటువంటి క్రాంతి యువజన సంఘం ఆధీనంలో ఉందని, అట్టి భూమి హయత్ నగర్ మండల రెవెన్యూ రికార్డులలో కూడా పొందుపరచి ఉందని అన్నారు. క్రాంతి యువజన సంఘం ఆధీనంలో ఉన్నటువంటి ఆ భూమిలో కొన్ని ఏండ్లుగా స్వాతంత్ర దినోత్సవ, గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుతామని, గ్రామ సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమం సమావేశాలు ఏర్పాటు చేసుకుంటామని అన్నారు. పసుమాముల గ్రామానికి ఎలాంటి సంబంధం లేనటువంటి వనం సురేందర్ అనే వ్యక్తి యువజన సంఘం ఆధీనంలో ఉన్నటువంటి ఆరెకరాల భూమిని ఎలాంటి నిర్మాణాలు కూడా లేనటువంటి ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని జీవో 59 కింద దరఖాస్తు చేసుకొని కబ్జా యత్నిస్తున్నాడని సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. ఎలాంటి నిర్మాణాలు లేని స్థలంలో జీవో 59 క్రింద మంజూరు అయ్యే అవకాశం లేదని, కానీ విచారణ అధికారిని తప్పుదోవ పట్టించారా, లేక విచారణ అధికారి అండదండలతోనే ఇదంతా జరుగుతుందా అనే అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులను తప్పుదోవ పట్టించి, ప్రభుత్వ భూమిని కబ్జాకు యత్నిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరారు. లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు ఆర్డిఓకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పబ్బతి లక్ష్మణ్, చెవుల హరిశంకర్, సిపిఐ నాయకులు ముత్యాల యాదిరెడ్డి, యువజన సంఘం అధ్యక్షుడు గూడెపు జగన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జోర్క నరహరి తదితరులు పాల్గొన్నారు.

# పాలకవర్గం సమక్షంలో సర్వసభ్య సమావేశం

**పిఎసిఎస్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి**




**ఇబ్రహీంపట్నం:-ప్రభాత సూర్యుడు :**

ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం శుక్రవారంనాడు సంఘం అధ్యక్షులు టేకుల సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన బ్యాంకు సీఈవో గణేష్, పాలకవర్గం సమక్షంలో సర్వసభ్య సమావేశం ఉప్పరగూడ పిఎసిఎస్ సమావేశ మందిరంలో నిర్వహించారు. సమావేశంలో గత బడ్జెట్, జమ ఖర్చులకు సంబంధించిన నివేదికలను రైతులకు అందజేశారు. 2023-24 సంవత్సరం అంచనా బడ్జెట్ ఆమోదించడం తదితర అంశాలపై చర్చించినట్లు సహకార సంఘం అధ్యక్షుడు టేకుల సుదర్శన్ రెడ్డి అన్నారు. సమావేశానికి సహకార సంఘం కార్యవర్గ సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశంలో టేకుల రామ్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ మన ప్రజల ముఖ్యమైన వృత్తి అని దీనికి కావలసిన పెట్టుబడులు లభించక రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తీసుకొని సకాలంలో తీర్చలేక తమ స్థిరాస్తులను అమ్ముకోవడం జరుగుతుందని అన్నారు. రైతులే సహకార సంఘానికి స్థాపించుకొని దాని ద్వారా తమ కావాల్సిన నాణ్యమైన పరికరాలు, విత్తనాలు, ఎరువులు పొందుతున్నారని అన్నారు. దేశాభివృద్ధికి ప్రజా సంక్షేమానికి సహకార ఉద్యమం మూలాధారమైందని పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశానికి హాజరైన రైతులద్వారా పలు సలహాలు సూచనలు విన్నారు. అదేవిధంగా పిఎసిఎస్ సంఘ భవనం పై నూతనంగా మీటింగ్ హాలు నిర్మించామని, చనిపోయిన రైతులకు 15000 వేల ఆర్థిక సహాయం, రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో పంపిణీ చేస్తున్నామని, అదేవిధంగా సంఘ రైతులకు వ్యవసాయేతర రుణాలు పది లక్షల వరకు సకాలంలో పంపిణీ చేస్తున్నామన్నారు. సంఘ రైతులకు వ్యవసాయం, వ్యవసాయేతర సేవలు అందించుటకు ఇబ్రహీంపట్నం పరిధిలోని సీతారాంపేటలో గోదాం నిర్మించి శంకుస్థాపనకు నాబార్డ్ చైర్మన్ గోవిందరాజులు, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించామని, గోధుమ పక్కనే రైస్ మిల్లు కూడా నిర్మాణాన్ని త్వరలో చేపట్టి పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. సహకార సంఘం బ్యాంక్ మేనేజర్ గణేష్ రైతుల సందేహాలకు సమాధానాలు సలహాలు సూచనలు ఇచ్చారు. సంఘంలో 1812 మంది రుణాలు పొందారని అన్నారు. స్వల్పకాలిక రుణాలు పంట రుణాలు బంగారంపై, రైతులకు వ్యక్తిగత రుణాలు, మహిళా సంఘాలకు రైతు మిత్ర గ్రూపులకు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా ధీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నామన్నారు. ఈ సర్వసభ్య సమావేశానికి సంఘం అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు క్యామశంకర్, పాలకవర్గ సభ్యులు, ఎదుర్ల పాండురంగారెడ్డి, ఎదురు జంగారెడ్డి, కరింగ్ విశాల, వర్త్య సీతయ్య, బొమ్మ కంటి అశోక్, మేడిపల్లి పుల్లయ్య, సుబ్బారి జంగయ్య, కంబాలపల్లి చంద్రశేఖర్ రెడ్డి,పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నల్లోల్ల పోచమ్మ, గుర్రం సుధాకర్ రెడ్డి, బోసుపల్లి గణేష్, (కార్యదర్శి) పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక రోగాలకు కారణమవుతున్న బీపీ, షుగర్




**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** ప్రాథమిక దశలోనే బీపీ, షుగర్‌లను గుర్తించి చికిత్స తీసుకోకపోవడం వల్ల దీర్ఘకాలిక రోగాలకు కారణం అవుతున్నాయన్నారు మంత్రి హరీశ్ రావు. వాటివల్ల గుండె, కిడ్నీలు, కాలేయం వంటి ముఖ్యమైన అవయవాలు దెబ్బతింటున్నాయని చెప్పారు.ఒకప్పుడు కమ్యూనికబుల్ వ్యాధులు ఎక్కువగా ఉంటే ఇప్పుడు నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ అధికమ వుతున్నాయని అన్నారు. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కనీస వ్యాయామం చేయకపోవడం, చెడు అలవాట్లు, మానసిక ఒత్తిళ్లు వంటివి దీనికి కారణమని చెప్పారు. ఇటీవల నిర్వహించిన ఓ సర్వే ప్రకారం రాష్ట్రంలో 24 శాతం షుగర్, 14 శాతం బీపీ కేసులు ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ప్రభుత్వం బీపీ, షుగర్ మందులను ఉచితంగా అందిస్తున్నదని వెల్లడించారు. హైదరాబాద్‌లోని దుర్గంచెరువు వద్ద కార్డియాలజిస్ట్ సొసైటీ తెలంగాణ స్టేట్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో వరల్డ్ హార్ట్ డే కార్యక్రమంలో మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎక్కువగా గుండె సమస్యలకు బీపీ ఒక కారణం అవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారని వెల్లడించారు. సడెన్ కార్డియాక్ అరెస్ట్ వల్ల దేశంలో ఏటా సుమారు 15 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. సమయం, సందర్భం, చిన్నా, పెద్దా అనే తేడాలేకుండా ఎవరికైనా సడెన్ కార్డిక్ అరెస్ట్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అయితే సకాలంలో సీపీఆర్ చేయడం వల్ల వీరి ప్రాణాలు కాపాడటం సాధ్యం అవుతుందన్నారు. జిమ్ చేస్తూ, పనులు చేస్తూ, డ్యాన్స్ చేస్తూ, నడుస్తూ కొంత మంది అకస్మాత్తుగా పడిపోవడం, ప్రాణాలు కోల్పోవడం వంటివి మనం తరచూ చూస్తున్నామని అన్నారు. ఆ సమయంలో సీపీఆర్ తెలిసిన వారు ఉంటే వారి ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని వెల్లడించారు. అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడే అతి ముఖ్యమైన సీపీఆర్ విధానం గురించి మన దేశంలో 98 శాతం మందికి తెలియదన్నారు. ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా సీపీఆర్‌పై అవగాహన కల్పించాలని, శిక్షణ ఇప్పించాలని నిర్ణయి ంచారని వెల్లడించారు.ఇందులో భాగంగా, పారామెడికల్ సిబ్బందితోపాటు వైద్య, మున్సిపల్ సిబ్బంది, పోలీసు, కమ్యూనిటీ వాలంటీర్లు, ఉద్యోగులు, రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ల ప్రతినిధులు, సిబ్బంది, కమర్షియల్ కాంప్లెక్స్ వర్కర్స్ ఇలా వివిధ వర్గాలకు చెందిన వ్యక్తులకు సీపీఆర్ మీద శిక్షణ ఇచ్చామన్నారు. దీనికోసం అవసరమైన 1262 ఏఈడీ మిషన్లు సమకూర్చుకుని అన్ని సీహెచ్‌సీలు, యూపీ హెచ్‌సీలు, బస్తీ దవాఖానల్లో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీల్లో కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ప్రతిఒక్కరు బీపీ, షుగర్ బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. బాడీ మాస్ ఇండెక్స్‌ని పరిమితిలో ఉంచుకోవాలన్నారు. బీపీ, షుగర్ నియంత్రణలో ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, రోజుకు కొంత సమయం వ్యాయామం, ధ్యానం చేసేందుకు కేటాయించాలని చెప్పారు. ఒత్తిడికి లోనుకాకుండా ఉండేందుకు ప్రయత్ని ంచాలన్నారు. అందరం ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్య తెలంగాణ, ఆరోగ్య భారత్ సాధ్యమవుతుందని చెప్పారు. కాగా, గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలపై ప్రచారం కల్పించేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఏటా ఈరోజు వరల్డ్ హార్ట్ డేగా నిర్వహిస్తుంటారని, ఈ సారి 'జబవ ఊవజీటీబి, ఐనినీలి ఊవజీటీబి' అనే థీమ్‌తో నిర్వహించుకుంటున్నామన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215